
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 28.0 | కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY
5



ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.12 కోట్లు

- ఏడాదిగా ఆస్పత్రుల యాజమాన్యాల ఎదురుచూపులు
- విడుదల చేసేందుకు జాప్యం చేస్తున్న ప్రభుత్వం
- ప్రైవేటు దవాఖానాల్లో నిలిచిన సేవలు
- అత్యవసరమైతే అడ్డదారులు



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఆరోగ్య శ్రీ విభాగం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 18: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం అబాసుపాలవుతోంది. పథకం కింద ఆపరేషన్ చేసిన ఆస్పత్రులకు రావలసిన బకాయిలను ఇవ్వడంలో ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు దాదాపు రూ.12 కోట్లు ఏడాదిగా పెండింగ్ ఉన్నాయి. దాంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రైవేటు యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. దీంతో తమ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేస్తున్నామంటూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశాయి.

పేరుకుపోయిన బకాయిలు..


మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు దాదాపు 16 ఉండగా, ప్రభుత్వ ఆస్పత్రులు రెండు ఉన్నాయి. జిల్లావ్యాప్తం గా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కలిపి ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.12 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.1.50 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు దాదాపు రూ. 10.50 కోట్లు పెండింగ్ ఉన్నాయి. గతంలో ఉన్న బకాయిలు చెల్లించడంతో కొంత ఉపశమనం కలిగినప్పటికీ, ఏడాదిగా చెల్లించడం లేదు.

అదనంగా వసూలు

ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లు చేయడానికి ప్రైవేటు ఆస్పత్రులు ఆసక్తి చూపడం లేదు. గత్యంతరం లేక చేస్తే.. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ కాకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తూ, అడ్డదారులు తొక్కుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందించే ఆపరేషన్ సామగ్రి నాసిరకంగా ఉంటున్నాయని, అదనంగా డబ్బులు చెల్లిస్తే నాణ్యమైన పరికరాలు వేస్తామని చెబుతున్నాయి. ఒక్కో ఆపరేషన్‌కు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ డబ్బులు కూడా క్లెయిమ్ చేసుకుంటున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రులపై చిన్నచూపు..

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రభుత్వమే చిన్న చూపు చూస్తోంది. ఒక్క ఆరోగ్యశ్రీ కేసు కూడా ప్రైవేటుకు వెళ్లనీయొద్దని, అన్ని కేసులకూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయాలని చెబుతున్నా, నిధులు మంజూరు చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులకు ఐదారు నెలలకు డబ్బులు ఇస్తుండగా, అదే ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రం ఆరు నుంచి ఎనిమిది నెలలుగా పెండింగ్ బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ప్రైవేటులో కొనుగోలు చేసిన వైద్య పరికరాలకు డబ్బులు ఇవ్వాలని ఒత్తిళ్లు కూడా వస్తున్నాయి.


ఆరోగ్య శ్రీ / EHS కొనసాగించలేక పోవడానికి కారణాలు ప్రియమైన ప్రజలకు సవినయముగా తెలియజేయునది ఏమనగా !
2007లో ప్రభుత్వము పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యము అందించాలన్న సదుద్దేశముతో "ఆరోగ్య శ్రీ" పథకంను ప్రవేశపెట్టింది. పేద ప్రజలకు ఉచితంగా ఓ.పి. సదుపాయం, పరీక్షలు మరియు ఆపరేషన్ జరిగిన తరువాత భోజనం, తిరిగి వెళ్లేటప్పుడు నగదు ఇవ్వడం జరుగుతుంది. ప్రైవేటు ధర కన్నా సగానికి సగం తక్కువ ధరల్లో శస్త్ర చికిత్సలు చేస్తున్నాము. కాని గత సంవత్సరం మార్చి నెల నుంచి ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి అందవలసిన బకాయిలు రావడం లేదు. అయిన గాని ఇన్ని రోజులు అనేక ఇబ్బందులను ఎదుర్కొని కూడ ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాము. ఇవి కాక ఆసుపత్రిలో సిబ్బందికి వేతనాలు, రోగుల భోజన సదుపాయము, మందుల ఖర్చులు, కరెంట్ మరియు అనేక ప్రభుత్వ ట్యాక్స్‌లు కట్టలేని పరిస్థితి ఏర్పడినది. ఆరోగ్యశ్రీ ట్రస్టు వారికి అనేకసార్లు విన్నవించినప్పటికి ఏమి ఉపయోగం లేకపోయింది. కావున తప్పనిసరి పరిస్థితులలో జనవరి నెల 10వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ/ EHS సేవలను అందించలేక పోతున్నాము. మీకు కలిగే అసౌకర్యమునకు చింతిస్తుచూ ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్న

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు పాలమూరులోని నవోదయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నోటీసు

ప్రభుత్వం కొద్ది కొద్దిగా చెల్లిస్తూనే ఉంది..

ప్రభుత్వం గత కొన్ని నెలలుగా కొద్ది కొద్దిగా నిధులు చెల్లిస్తూనే ఉంది. అన్ని ఒకేసారి వేయడం కొంత ఇబ్బందిగా ఉండటం వలన కొద్దో గొప్పో విడుదల చేస్తోంది. పెండింగ్ నిధులు కూడా ఈ నెలలో వేసే అవకాశాలు ఉన్నాయి. అన్ని కేసులు చేయకుండా ఉండొద్దని, ఎమర్జెన్సీ కేసులు చేయాలని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు తెలియజేశాం. అత్యవసర కేసులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా నెల రోజుల క్రితం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న నిధులు త్వరలో వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

- డాక్టర్ స్వప్న, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త

ఉమామహేశ్వరానికి

పోటెత్తిన భక్తులు

- నందివాహనంపై ఊరేగిన పార్వతీపరమేశ్వరులు
- కొండ దిగుతుండగా ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



నందివాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు 7

అదుపు తప్పి ఆటో బోల్తా

ఎనిమిది మందికి గాయాలు

- సింగోటం జాతరకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం 7

పాము కాటుతో

ఇంటర్ విద్యార్థిని మృతి 7

పదికి.. పక్కా ప్రణాళిక

- చిన్న పాటి జాగ్రత్తలు తీసుకుంటే మంచిదంటున్న టీచర్లు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్) 7

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి

నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



ఊర్కొండపేట వన నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఊర్కొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలు సేకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో పాటించవలసిన నియమ నిబంధనలు వివరించారు. అనంతరం వన నర్సరీని పరిశీలించారు. అంతకు ముందు ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ రామ్‌కోటి, ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- 21 నుంచి సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు : కలెక్టర్ ఆదర్శ్ సురభి



గోవర్ధనగిరిలో సర్వే అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వీపనగండ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వేపై ఆరా తీశారు. రైతుభరోసా పథకంలో వ్యవసాయేతర భూముల్ని ఏ విధంగా గుర్తిస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలు గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోవర్ధనగిరి గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. రైస్ మిల్లు, కోళ్లషెడ్లు, చేపల చెరువులు, గ్రామ సమీపంలోని ఇంటి స్థలాలు వంటి వాటిపై దృష్టి సారించాలని తెలిపారు. జనవరి 21 నుంచి 24 వరకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల తుది జాబితాపై నిర్వహించే గ్రామసభలు ఏ గ్రామంలో ఏ రోజు నిర్వహిస్తున్నారో ముందుగానే అన్ని గ్రామాల్లో టామ్‌టామ్ వేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మప్ప, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు 7

ఎయి'డెడ్'

- 15 ఏళ్లుగా నిలిచిపోయిన నియామకాలు
- ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఎయిడెడ్ పాఠశాలలు
- కోర్టు కేసుల పేరిట మూసివేసే యత్నం



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నేషనల్ హై స్కూల్

నాగర్‌కర్నూల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు సమృద్ధిగా లేని కాలంలో విద్యాకుసుమాలను వెదజల్లిన ఎయిడెడ్ పాఠశాలలపై ప్రభుత్వాలు శీతకన్నును ప్రదర్శిస్తున్నాయి. విద్యాభిమానులు పాఠశాలను నెలకొల్పి విరాళాలతో దాదాపు 40 ఏళ్లపాటు కొనసాగించిన ఎయిడెడ్ పాఠశాలలు అంపశయ్యపై ఉన్నాయి. 15 ఏళ్ల నుంచి ఎయిడెడ్ పాఠశాలల నియామకాలు నిలిచిపోవడంతో విద్యార్థుల సంఖ్యతో పాటు టీచర్ల పరిస్థితి కూడా దయనీయంగా తయారైంది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి దారుణం..

ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల విషయంలో ఉమ్మడి జిల్లా అంతటా నిర్లక్ష్యమైన పరిస్థితి కొనసాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 14 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా 23 మంది టీచర్లు, 470 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఒక్కో పాఠశాలలో నిష్పత్తి ప్రకారం 20 మంది విద్యార్థులకు ఒక టీచరు

(మిగతా 6వ పేజీలో..)

ఆర్డీఎస్ రైతులు అధైర్య పడొద్దు

- సాగునీటి విడుదలపై స్థానిక నాయకులకు స్పష్టత లేదు
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



సుంకేసుల బ్యారేజ్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

వడ్డేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ పరిధిలో పంట సాగు చేస్తున్న రైతులెవరూ అధైర్య పడొద్దని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన తుంగభద్ర, సుంకేసుల రిజర్వాయర్‌తో పాటు తుమ్మిళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు నీటి ఇన్‌ఫ్లోను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజులుగా అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టుదారులు ఆర్డీఎస్‌కు నీరు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తుండటం ఎంతో బాధకలిగిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో వర్షాభావ, సాంకేతిక, పరిపాలన కారణాల వల్ల సకాలంలో సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి సుంకేసుల బ్యారేజ్, తుమ్మిళ్ల ఎత్తిపోతల సందర్శనకు వచ్చానని తెలిపారు. అలంపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బీఆర్ఎస్ నాయకులకు ఆర్డీఎస్‌పై అవగాహణ లేదని, ఏదో ఫొటోలకు ఫోజులు ఇవ్వాలనే తపన తప్ప రైతులకు ఉన్న అనుమానాలు, అపోహలను, సందేహాలను నివృత్తి చేయడంలో ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. రైతులకు వాస్తవాలు తెలిపి న్యాయం చేయాలన్న ఉద్దేశంతో తాను ఇక్కడికి వచ్చానన్నారు. తాము వారం రోజుల క్రితం తుంగభద్రకు ఇండెంట్ పెట్టామని తెలిపారు. కాగా, 5.86 టీఎంసీలకు గాను ఎన్నింటికి ఇండెంట్ పెడితే రైతులకు న్యాయం జరుగుతుందో రెండు రాష్ట్రాల అధికారులకు తెలుసునని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇండెంట్‌తో ఆర్డీఎస్ రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగదని, దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వం రెండు రాష్ట్రాలు కలిపి ఇండెంట్ పెడితేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారాంరెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎస్ఎల్‌బీసీ పనుల సమీపంలో

చిరుత సంచారం

- భయంతో వణుకుతున్న ప్రజలు



ఎస్ఎల్‌బీసీ పనుల సమీపంలో సంచరిస్తున్న చిరుత

దోమలపెంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట మండలంలో ఎస్ఎల్‌బీ సొరంగపు పనుల సమీపంలో శుక్రవారం రాత్రి చిరుతపులి కనిపించడంతో కార్మికులు, ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఇక్కడ పనిచేసున్న కార్మికుడిపై ఎలుగుబంటి దాడి చేయడంతో ఆసుపత్రి పాలయ్యాడు. అంతే కాకుండా దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ గ్రామాల్లోకి చిరుతపులులు చొరబడి మేకలు, పెంపుడు కుక్కలను ఎత్తుకు పోతున్నాయిని గ్రామస్థులు వాపోతున్నారు. రాత్రి వేళలో బయటికి రావాలంటేనే ఆయా గ్రామాల ప్రజలు జంకుతున్నారు.



పెబ్బేరులో అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజాపాల కొనసాగుతోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు పట్టణంలో రూ.2.80 కోట్ల నిధులతో మురుగు కాల్వల నిర్మాణం, పాత చేపల మార్కెట్ దగ్గర షాపింగ్ మాల్ ఏర్పాటుకు రూ.45 లక్షలు, బస్టాండ్ నుంచి బైపాస్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1 కోటి, రూ.60 లక్షలతో మరో తొమ్మిది షాపుల నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిల్లో అమలు చేస్తామన్నారు. పెబ్బేర్ పట్టణం, గ్రామాల అభివృద్ధిని పూర్తిస్థాయిలో చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పెబ్బేరు పట్టణంలో కొల్లాపూర్ చౌరస్తా దగ్గర ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

రంగాపూర్ ఉర్సు

- రంగాపూర్ దర్గాలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన రంగాపూర్ దర్గా 7

ఫీల్డ్ విజిట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సాగు యోగ్యంగా లేని భూములను గుర్తించి వారిని రైతు భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రైతు భరోసా పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతు భరోసా పథకానికి సంబంధించి 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు పక్కాగా జరపాలన్నారు. నాలా కన్వర్షన్ భూములకు ప్రొసీడింగ్స్ నమోదు చేయాలని, భూ సేకరణ చేసిన భూములకు ఫైల్ నెంబర్లు ఉండాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, లేఅవుట్లు ఉన్న భూములను వ్యవసాయేతర భూములుగా పరిగణించాలని, రాళ్లు, రప్పలు ఉన్న భూములను ఫీల్డ్ విజిట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టరు లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్, ఏడీఏ ఉన్నారు.

అప్‌గ్రేడ్‌పై ఆశలు

● అమలైతే మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు మొదటి ప్రాధాన్యం
● జడ్చర్లలో సబ్ డివిజన్, ట్రాఫిక్ పీఎస్..
● కొత్త మండలాలు కౌకుంట్ల, మహ్మదాబాద్‌లలో స్టేషన్ల ఏర్పాటు
● డీజీపీ భరోసాతో ఆశలు

మహబూబ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఉమ్మడి పాలమూరులోనే పెద్దది. మూడు పోలీస్ స్టేషన్లకు సరిపోయే జనాభా ఇక్కడ ఉంది. ఏటా 800-900 కేసులు నమోదవుతుంటాయి. ఇంత ప్రాధాన్యం కలిగిన పోలీస్ స్టేషన్ ఇప్పటివరకు అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు. ప్రస్తుతం అక్కడ ఎస్‌ఐ ఎస్‌హెచ్‌వో కావడంతో మెన్ కేటాయింపు తక్కువగా ఉంది. ప్రస్తుతం స్టేషన్‌కు 40 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అదే అప్‌గ్రేడ్ చేసి, సీఐ ఎస్‌హెచ్‌వోగా ఉంటే 60-70 మంది సిబ్బందిని కేటాయించే అవకాశం ఉంటుంది. జిల్లాకు వచ్చిన డీజీపీ జితేందర్ పాత పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. అయితే జిల్లాలో ముందుగా రూరల్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూరల్ మండలానికి చెందిన 18 గ్రామ పంచాయతీలున్నాయి. మునిసిపాలిటీ పరిధిలో దాదాపు 17 వార్డులు ఉన్నాయి. అంటే పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు లక్షన్నర జనాభా ఉండగా కేవలం 40 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. దీంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తడంతోపాటు పోలీసులపై తీవ్ర భారం పడుతోంది. దాంతో కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్‌తోపాటు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి ప్రతిపాదనలున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పుడు డీజీపీ అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి.

కొత్త పోలీస్ స్టేషన్‌ల ప్రతిపాదనలకు మోక్షం లభించేనా?

మహబూబ్‌నగర్ త్రీటౌన్‌తోపాటు జడ్చర్ల సబ్ డివిజన్ కోసం ప్రతిపాదనలున్నాయి. జడ్చర్లను రెవెన్యూ డివిజన్ చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పట్టుబడుతున్నారు. రెవెన్యూ డివిజన్‌తోపాటు సబ్ డివిజన్ ఏర్పాటుచేస్తే పాలన మరింత మెరుగుపడనుంది. జిల్లాలో మూడు నియోజకవర్గాలతో పాటు జాతీయ రహదారి ఉంది. జడ్చర్ల పట్టణం విస్తరిస్తుండటం, అక్కడ పోలేపల్లి సెజ్ ఉండటంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. దీంతో జనాభా పెరుగుతోంది. ట్రాఫిక్ పెరుగుతున్నందున సబ్ డివిజన్‌తోపాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఒకే సబ్ డివిజన్ ఉండటంతో ఇబ్బందిగా మారుతున్నందున మరో సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని పోలీసులు కోరుతున్నారు. అదేవిధంగా జడ్చర్లలో కేవలం టౌన్ పోలీస్ స్టేషన్ మాత్రమే ఉంది. ఇక్కడ రూరల్, టౌన్ సీఐలు ఉన్నా, జడ్చర్ల రూరల్‌కు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ లేదు. ఇక్కడ కూడా జనాభా లక్షదాటినా రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. పట్టణంలో 27 వార్డులు, రూరల్‌లో 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అంతా కలిపి దాదాపు 2 లక్షల వరకు జనాభా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోనే జడ్చర్లలో అత్యధికంగా కేసులు నమోదవుతాయి. గతేడాది 913 కేసులు నమోదయ్యాయి. ఇక్కడ కచ్చితంగా రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలను డీజీపీ దృష్టికి జిల్లా పోలీసులు తేగా, పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కొత్త మండలాలకు స్టేషన్‌ల ఏర్పాటు ఎప్పుడో?

జిల్లాల విభజన తరువాత ఏర్పాటైన కొత్త మండలాల్లో పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు అయ్యాయి. రెండో విడతలో మండలాలు అయిన వాటికి ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేయలేదు. జిల్లాలోని కౌకుంట్ల, మహ్మదాబాద్ మండలాలకు స్టేషన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో కౌకుంట్ల స్టేషన్ దేవరకద్రలో, గండీడ్, మహమ్మదాబాద్ మండలాలకు మమ్మదాబాద్ స్టేషన్ కేంద్రంగా పాలన నిర్వహిస్తున్నారు. రెండు మండలాలకు ఒకే స్టేషన్ ఉండటంతో ఏదైనా జరిగితే ఘటనా స్థలికి పోలీసులు చేరుకోవడంలో జాప్యం జరుగుతుందన్న విమర్శలున్నాయి. జిల్లాలో వెంటనే పోలీస్‌స్టేషన్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు కొత్త పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

● జెన్‌కో సీఈకి ఆర్టిజన్ల వినతి



జెన్‌కో సీఈకి వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు, ఆర్టిజన్స్

దోమలపెంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గత 23 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకు పైగా ఆర్టిజన్స్ జెన్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ వివిధ విభాగాలలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఈగలపెంట జెన్‌కో ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకుడు లక్ష్మయ్య అన్నారు. శనివారం జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని, జెన్‌కో యాజమాన్యం మొండి వైఖరి విడనాడి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. అన్ని విద్యుత్ కేంద్రాల సర్కిల్ కార్యాలయాల ముందు ఈ నెల 20 నుంచి 24 వరకు నిరవధిక దీక్షలు చెపడుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కిషన్, సుబ్బారెడ్డి, మత్తేసు ఉన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అచ్చంపేటటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ప్లాట్ల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి జరిగిన సంఘటన శనివారం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. అచ్చంపేట మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో 2008 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్ర భుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో 50 గజాల స్థలం చొప్పున పేదలకు పంపిణీ చేసింది. అదే కాలనీకి చెందిన రామకృష్ణ పట్టణానికి చెందిన సంతోష్‌లు కలిసి లబ్ధిదారుల నుంచి తక్కువ ధరలకు వాటిని కొనుగోలు చేసి అధిక ధరలకు గత 6 నుంచి 7 ఏళ్లు అమ్మిసొమ్ము చేసుకునే వారని స్థానికులు తెలుపుతున్నారు. ఆ అమ్మకాలలో ఇద్దరి మధ్య డబ్బుల వ్యవహారంలో కొద్ది రోజులుగా వాగ్వివాదం జరుగుతున్నట్లు తెలిసింది. సంతోష్ అనే వ్యక్తి రామకృష్ణ అనే వ్యక్తికి డబ్బులు ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బులు రామకృష్ణ, సంతోష్‌ను గట్టిగా అడుగుతున్నాడని, ఎలాగైన భయపెట్టించాలని శనివారం ఉదయం రాజీవ్ నగర్ కాలనీలో రామకృష్ణపై సంతోష్ కత్తితో దాడిచేశాడని స్థానికులు తెలిపారు. రామకృష్ణకు కత్తిపోట్ల వల్ల రక్తస్రావం కావడంతో అతన్ని వెంటనే 108 అబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందించి, జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ రమేష్‌ను సం ప్రదించగా బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఘనంగా హజ్రత్ మౌలాలీ గంధోత్సవం



గంధాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

భూత్పూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తమొల్గర గ్రామ శివారులోని మూర్తయ్యగుట్ట మీద వెలసిన హజ్రత్ మౌలాలీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు కొత్త మొల్గర గ్రామం నుంచి మూర్తయ్య గుట్ట మీదకు గంధం తీసుకెళ్లారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా నిర్వాహకులు ముజీబ్ తెలిపారు.

ఘనంగా ఖాదర్ బాషా దర్గా ఉర్సు ఉత్సవాలు

కొల్లాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకతీతంగా కొలిచే ఖాదర్ బాషా దర్గా ఉర్సు ఉత్సవాలు కొల్లాపూర్ పట్టణంలో రెండు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం అన్నదానం చేశారు. ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి హైదరాబాద్ కళాకారులతో ఖవాలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సఫారీ పర్యాటకులకు కనిపించిన పెద్దపులి

వాచ్ టవర్ వద్ద పొదల్లో..

మన్ననూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని సఫారీ టూర్ పర్యాటకులకు శనివారం పెద్దపులి దర్శనమిచ్చింది. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన భాస్కర్, నిరీక్షణ దంపతులతో పాటు వారి పిల్లలు తబిత, సుకీర్తిలు శనివారం ఉదయం 11 గంటలకు నల్లమల అడవిలో ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూ పాయింట్‌కు సఫారీ వాహనంలో వెళుతున్న క్రమంలో ఫైర్ వాచ్ టవర్ వద్ద చెట్ల పొదల్లో నుంచి పెద్దపులి సంచరిస్తూ కనిపించింది. చాలా సంతోషపడిన పర్యాటకులు వారి సెల్‌ఫోన్లలో పులి దృశ్యాన్ని చిత్రీకరించారు. గతేడాది డిసెంబరు నెలలో రెండు పర్యాయాలు సఫారీ పర్యాటకులకు పెద్దపులి కనిపించాయి. శనివారం పులిని చూడడం చాలా అనుభూతినిచ్చిందని పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు. చలి కాలం కావడం, తరచూ నల్లమలలో పొగ మంచు కమ్మేస్తూ ఉండడంతో ఫర్హాబాద్, గుండం, నిజాం నవాబు పాత బంగ్లా ప్రాంతాల్లో పులులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. పెద్దపులిని చూడాలనే ఆతృతతో టైగర్ సఫారీకి రావాలని పర్యాటకులు సెలవులు వస్తే చాలు నల్లమలను చుట్టేస్తున్నారు. మగ పులి 19 అయి ఉండవచ్చునని అటవీ అధికారులు భావిస్తున్నారు. అటవీ శాఖ సీసీ ట్రాప్ కెమెరాల్లో పరిశీలించాక పులి పేరును అటవీ అధికారులు నిర్ధారిస్తారు. ఈ విషయమై మన్ననూరు డిప్యూటీ రేంజ్ అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, పులి పర్యాటకులకు కనిపించిన మాట వాస్తవమేనని ఆయన ధ్రువీకరించారు.

శివస్వాములకు ముస్లిం యువకుడి భిక్ష

● మత సామరస్యం చాటిన మున్నా ● ఘనంగా సన్మానించిన శివస్వాములు



బిజ్వార్‌గ్రామంలో మున్నాను సన్మానిస్తున్న శివస్వాములు

ఊట్కూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆరాధించే మార్గం వేరైనా అందరి దైవత్వం ఒక్కటే అనే విశ్వాసంతో శివమాలధారణ చేసిన స్వాములకు ఓ ముస్లీం యువకుడు భిక్ష(అన్నదానం)ను ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నాడు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామానికి చెందిన మహమ్మద్ మున్నా శివస్వాములకు అన్నదానం చేయాలనే సంకల్పంతో గ్రామంలోని శివస్వాములను కలిసి విషయాన్ని చెప్పాడు. గురుస్వాములు నరేష్, భాస్కర్‌రెడ్డిలు సమ్మతించడంతో శివస్వాములందరికీ మున్నా శనివారం గ్రామంలోని ఆలయంలో భిక్షను ఏర్పాటు చేసి అందరికీ వడ్డించాడు. అనంతరం మున్నా మాట్లాడుతూ చలిని సైతం లెక్క చేయకుండా దేవుడి భక్తిలో మునిగే శివస్వాములకు అన్నదానం చేయాలనే కోరిక తీరడంతో చాలా సంతోషంగా ఉందని అన్నారు. పుట్టిన మతాలు, పూజించే విధానం వేరు కావచ్చు కానీ అందరి దేవుడు మాత్రం ఒక్కటేనని, ఇలాంటి సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం గురుస్వాములు నరేష్, భాస్కర్‌రెడ్డి, జి.నర్సిములు చాకలి ఆంజనేయులు కలిసి యువకుడు మున్నాను శాలువాలతో సన్మానించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నచింతకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన రాజు (36) శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు మృతుడి భార్య జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

21న సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా స్థాయి ఎంపికలను ఈనెల 21న స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డుతో ఉదయం 7:30 గంటలకు స్టేడియంలో కోచ్ సునీల్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు.

ఎల్లూరులో కాకతీయ కాలపు అరుదైన వీరగల్లు శిల్పం

- కాపాడుకోవాలంటున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



ఎల్లూరులో వీరగల్లు శిల్పాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివ నాగిరెడ్డి

కొల్లాపూర్/పెబ్బేరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామంలో కాకతీయుల కాలంనాటి అరుదైన వీరగల్లును శనివారం గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివ నాగిరెడ్డి వెల్లడించారు. వెన్నెల సాహిత్య అకాడమీ సభ్యులు ముచ్చర్ల దినకర్, చరిత్ర పరిశోధకుడు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు బైరోజు శ్యామ్ సుందర్‌లతో కలిసి ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని బాపూజీ భవన్‌లో ఉన్న నల్ల శానపురాతిపై నలువైపులా శిల్పాలతో చెక్కిన వీరగల్లును శనివారం వారు సందర్శించినట్లు శివనాగిరెడ్డి తెలిపారు. ఒకవైపు చెన్నకేశవుడు, రెండు, మూడో వైపు యుద్ధ దృశ్యాలు, నాలుగో వైపు ఒక స్త్రీ ఆత్మహుతి దృశ్యంతో కాకతీయ కాలపు మన విధానానికి అద్దం పడుతున్న శిల్పం ఉన్నట్లు చెప్పారు. ఇది నాగర్‌కర్నూల్ జిల్లాలో అరుదైనదని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం గల ఈ వీరగల్లును ఎత్తయిన పీఠంపై నిలబెట్టి చారిత్రక వివరాల బోర్డును ఏర్పాటు చేసి కాపాడుకోవాలని గ్రామస్థులకు నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురంలో నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయాన్ని ఆయన పరిశీలించారు. విజయనగర వాస్తు శిల్పశైలిలో ఈ శివాలయాన్ని నిర్మించారని, ఆలయ గోడలపై అనేక శిల్పాలు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఈ ఆలయాన్ని పున రుద్ధరించడం అవసరం అన్నారు. కార్యక్రమంలో స్థానికుడు సురగౌని కృష్ణయ్య గౌడ్, సాయి కిరణ్, అద్దంకి రవీంద్ర పాల్గొన్నారు.

గట్టు తహసీల్దార్ సస్పెన్షన్

- విధులపై నిర్లక్ష్యమే కారణం



సరితారాణి

గట్టు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల తహసీల్దార్ సరితారాణిని కలెక్టర్ బీఎం సంతోష్ శనివారం సస్పెన్షన్ చేశారు. విధులపై నిర్లక్ష్యంతో పాటు, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రైతు భరోసా, రేషన్‌కార్డుల సర్వేలో నిర్లక్ష్యం వహించారన్న కారణాలతో చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీనికి తోడు శుక్రవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ రైతుభరోసాపై సమీక్షకు గట్టుకు రాగ తహసీల్దార్ గైర్హాజరయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి తహసీల్దార్‌పై అనేక ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల తహసీల్దార్ అవినీతి, అక్రమాలపై కలెక్టర్‌కు గ్రామస్థులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. లంచం ఇవ్వనిదే ఫైలు కదలదని, ప్రతి పనికి ఒక ధర నిర్ధారించి వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. కొద్ది నెలలక్రితం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయానికి రాగా, కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదు. అప్పట్లో ఈ విషయం చర్చనీయాంశమైంది.

సివిల్ సర్వీసెస్ క్రీడలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం, సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు ఈ నెల 21లోగా జిల్లాలోని సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి వీ సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ గ్రీకో రేమన్, బెస్ట్ ఫిసిక్, ఖోఖో, యోగా విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నిర్దేశించిన తేదీ లోగా కలెక్టరేట్‌లోని జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

» పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో ప్రవీణ్‌కుమార్
» వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాలమూరులో ప్రారంభం కానున్న నవోదయ పాఠశాల



వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద హాల్ టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ బిజినేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-2026 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశాల కోసం శనివారం జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,602 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 5,331 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,990 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,636 మంది విద్యార్థులు హాజరయ్యారు. వనపర్తి జిల్లాలో 1,145 మంది హాజరు కావాల్సి ఉండగా 966 మంది హాజరయ్యారు. నారాయణపేట జిల్లాలో 690 మందికి గాను 578 మంది హాజరయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 967 మంది విద్యార్థులకు గాను 800 మంది హాజరయ్యారు. వికారాబాద్ జిల్లాలో 215 మంది గాను 193 మంది హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 329 మంది విద్యార్థులకు గాను 234 మంది హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,260 మంది విద్యార్థులకు గాను 924 మంది విద్యార్థులు హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐదు పరీక్ష కేంద్రాలను డీఈవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జవహర్ నవోదయ విద్యాలయం ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెంలో మాత్రమే ఉన్నది. వచ్చే విద్యాసంవత్సరం 2025-2026 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాకు నూతనంగా మంజూరైన నవోదయ పాఠశాల ప్రారంభం కానున్నది. అందుకు విద్యాశాఖ అధికారుల పాలమూరు జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో భవనాన్ని సిద్ధం చేశారు.

ఎయి'డెడ్'

(5వ పేజీ తరువాయి..)

ఉండాల్సి ఉండగా ఆ నిబంధన కొనసాగడం లేదు. వనపర్తి జిల్లాలో కూడా అదే పరిస్థితి నెలకొన్నది. జిల్లా కేంద్రంలోని ఐఎంబీ హైస్కూల్లో 15 మంది విద్యార్థుల ఉండగా ఒకే టీచర్ బోధన చేస్తుండడం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లాలో 10 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా 44 మంది టీచర్లు పనిచేస్తున్నారు. రెండు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వేతనాలు కూడా అందడం లేదు. పాలక ప్రభుత్వాలు గడిచిన 15 ఏళ్లుగా ఉద్దేశపూర్వకంగానే ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఎయిడెడ్ పాఠశాలల గురించి పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఒక్క ఉద్యోగ నియామకం కూడా ఎయిడెడ్ పాఠశాలల్లో జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా ఎయిడెడ్ పాఠశాలల ఆగమ్యగోచర పరిస్థితిపై ఎలాంటి కార్యాచరణ రూపొందించకపోగా కనీసం తమ వాణిని వినిపించాలని జనం కోరుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తే ఎయిడెడ్ పాఠశాలలను కాపాడుకోవడానికి తాము కూడా ముందు వరుసలో ఉంటా టమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విమర్శలకు దారి తీసే అంశమేమిటంటే ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన వారు కూడా ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతుల గురించి ప్రభుత్వం ముందు ఎలాంటి డిమాండ్ పెట్టకపోవడం పట్ల ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి



గత దశాబ్దన్నర కాలంగా ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు లేక మూతపడే దుస్థితికి వచ్చాయి. ఎయిడెడ్ యాజమాన్యాలు ఎన్నో వ్యయాప్రయాసాలకొర్చి ప్రభుత్వ పాఠశాలలకు సమానంగా ఆ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించారు. నియామకాలపై నిషేధం విధించిన ఫలితంగా క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి. లేదా కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి.

- డాక్టర్ ఎం.శ్రీధర్‌శర్మ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎయిడెడ్ పాఠశాలల ఉనికిని కాపాడాలి



గొప్ప సేవాభావంతో నెలకొల్పిన ఎయిడెడ్ పాఠశాలల ఉనికిని ప్రభుత్వాలు కాపాడాలి. ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో సామాన్య మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సేవా భావంతో నెలకొల్పిన ఎయిడెడ్ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే క్రమంలో ఎయిడెడ్ పాఠశాలలను విస్మరిస్తే ప్రజాస్వామ్యవాదులు క్షమించరు.

- గుడిపల్లి నిరంజన్, ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

శ్రీరంగాపురం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

పెబ్బేరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగాపురం ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ... జీవో 296 జారీ చేసినట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీరంగానాయక స్వామి వారి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రంగనాయక స్వామి ఆలయంతో పాటు శ్రీరంగసముద్రం జలాశయం ఉండడంతో ఈ ప్రాంతం ఎంతో ఆహ్లాదకారంగా ఉండడంతో ఈ పాంత్రం ఎంతో అభివృద్ధి చేస్తామన్నారు. బోటింగ్ సౌకర్యం, సుదరీకరణ, లైటింగ్, గార్డెన్స్ నిర్మాణం, కాటేజ్ ఏర్పాటు, రెస్టారెంట్లు ఏర్పాటు, కాలినడక దారుల అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.

టిప్పరు ఢీకొని వ్యక్తి మృతి



దావీదు (ఫైల్)

అయిజటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం స్టేజీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాపదిన్నె చెందిన దావీదు (40), తిమ్మప్ప, ఎజేకేల్ కలిసి వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామానికి బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని భారత్‌మాల రోడ్డుకు మట్టిని తరలించే టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన దావీదు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని దావీదు మృతదేహంతో కుటుంబ సభ్యులు వెంకటాపురం స్టేజీ వద్ద బైఠాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ సర్ధిచెప్పటం తో వారు శాంతించారు.

మెరుగైన వైద్యం అందించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ వైద్యులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైద్యసిబ్బంది

వెల్దండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని పల్లె దవాఖాన సబ్ సెంటర్‌లలో నాణ్యమైన వైద్యం అందించాలని కేంద్ర ఆరోగ్యశాఖ పరిశీలన సభ్యులు డాక్టర్ అరోకియా రూబెన్‌రాజ్, డాక్టర్ నిశాంత్‌లు సూచించారు. శనివారం మండలంలోని కొట్ర పల్లె దవాఖానాలో కేంద్ర ఆరోగ్యశాఖ పరిశీలకులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలను పరిశీలించారు. కాయకల్ప కార్యక్రమంలో ఉత్తీర్ణులైన సబ్‌సెంటర్‌లను ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్, డాక్టర్ నవీన్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతోష్, ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్, వైద్యులు మంజుభార్గవి, సింధు తదితరులు ఉన్నారు.

'అభయప్రధ'లో
వైద్య శిబిరం విజయవంతం

● వైద్య సేవలను వినియోగించుకున్న 300 మంది రోగులు


2డి ఈకో పరీక్ష చేస్తున్న ఆసుపత్రి ఎండీ డాక్టర్ విజయనారాయణ

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జనవరి 18: పట్టణంలోని అభయ ప్రధ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధులకు ఆసుపత్రి ఎండీ డాక్టర్ విజయనారాయణ ఫీజు లేకుండా ఓపీ చూడటంతో ఉచితంగా 2డి ఈకో గుండె పరీక్షలు చేశారు. అదేవిధంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ భారతి కూడా ఉచితంగా కంటి వ్యాధుల ఓపీ చూడటంతో పాటు అధునాతన యంత్రాల సహాయంతో కంటి పరీక్షలు చేశారు. ఒకే రోజు గుండె వ్యాధుల విభాగానికి సంబంధించి 150 మంది ఓపి సేవలు పొందగా 120 మందికి ఉచితంగా 2డి ఈకో పరీక్ష చేశారు. అంతేకాకుండా మరో 100 మందికి కంటి పరీక్షలు చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ విజయనారాయణ, డాక్టర్ భారతి దంపతులు మాట్లాడుతూ పేదలకు నామమాత్రపు ఫీజులు తీసుకొని వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రిని స్థాపించామని తెలిపారు. మొదటి రోజు ఉచితంగా యాంజియోగ్రామ్ చేశామని, క్యాత్‌ల్యాబ్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. అంతేకాకుండా త్వరలో గుండె వ్యాధులకుగాను ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలో సేవలను కూడా ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

పదికి.. పక్కా ప్రణాళిక

● ఇలా చేస్తే వందశాతం ఫలితాలు

● చిన్న పాటి జాగ్రత్తలు తీసుకుంటే మంచిదంటున్న టీచర్లు

● ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాయనున్న 50 వేల మంది విద్యార్థులు

● సీనియర్ ఉపాధ్యాయులు, డాక్టర్లు, విద్యావేత్తల సూచనలు, సలహాలు

ప్రణాళికతో పాటు పలు అంశాలపై దృష్టి పెడితే పదిలో వందశాతం మార్కులు పక్కాగా పొందవచ్చు అంటున్నారు విద్యానిపుణులు.. అందుకు తగిన సాధన చేస్తే అనుకున్న లక్ష్యం చాలా సులువవుతోందంటున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చిలో జరుగనున్నాయి. సమయం సమీపిస్తుండటంతో ఈసారి ఉత్తమ ఫలితాల సాధనకోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పరీక్ష భయాన్ని అధిగమించాలంటే విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలని... మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని అప్పుడే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని నిపుణులైన ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 1032 ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2024-2025 ఏడాదిలో పదో తరగతి వార్షిక పరీక్షలకు 50 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో భయం, వత్తిడి లేకుండా రాయాలంటే ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే మేలు జరుగుతుంది.

● **ఉపాధ్యాయుల సూచనలు**

విద్యార్థులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పది పరీక్షలను సులువుగా రాయవచ్చు. పాఠ్యాంశాలు ఎప్పటికప్పుడు చదవితే ఆందోళన ఉండదు. చదివిన వాటిని మరిచిపోకుండా ఉండాలంటే విద్యార్థులు ఒకటికి రెండు సార్లు రాస్తూ చదవితే మంచిది. చదువుకునేందుకు సమయ పాలన.. అందుకు తగ్గ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి. ఉపాధ్యాయులు బోధించిన ముఖ్యాంశాలను గుర్తు పెట్టుకొని చదివితే వాటికి సంబంధించిన ప్రశ్నలు పరీక్షలో వస్తాయి. ముఖ్యాంశాలు, ప్రశ్నలకు మార్కులు కేటాయింపు అవగాహన పెంచుకోవాలి. పాఠ్యాంశాలపై సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ప్రతిరోజు ఎన్ని పాఠ్యాంశాలు చదవాలి? వారంలో ఏ సబ్జెక్టు చదవాలి అన్న దాని పై ఓ ప్రణాళిక తయారు చేసుకుని చదివితే అనుకున్న లక్ష్యం సులువుగా సాధించవచ్చు. అదికూడా విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని, చదువుకునే సమయంలో ప్రతీ గంటకు ఓమారు ఐదు నుంచి 10 నిమిషాల పాటు విరామం తీసుకోవాలని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఇవి పాటిస్తే విద్యార్థులు పదిలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కాదని చెబుతున్నారు.

● **ఆహారం తీసుకునే విషయంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి**

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సమతుల్య ఆహారం అవసరం. ప్రోటీన్, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారంలో పండ్లు తప్పనిసరి తీసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులు మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్‌ఫుడ్స్ బయటి ఆహారం తీసుకోకుంటే మంచిది. ప్రతిరోజు ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో అరగంట పాటు వ్యాయమం చేస్తే మంచిది. ధ్యానం, ప్రాణయామం సాధన చేసుకుంటే మంచిది. ఒకేచోట కూర్చుని గంటల తరబడి చదవకుండా విరామం తీసుకోవాలి. చదువుకున్న అంశాలను విద్యార్థులు తోటి విద్యార్థులు సేహితులతో చర్చించుకోవాలి. ఇలా చేయడంవల్ల విద్యార్థులకు తాము చదుకున్న అంశాలు బాగా గుర్తుంటాయని పలువురు వైద్యులు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

● **ఆ సమయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం**



పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలను చదువుకునేందుకు అన్నివిధాల ప్రోత్సహించాలి. వారు తిట్టడం, మందలించడం వంటివి చేయకూడదు. పిల్లలకు పరీక్షల సమయంలో మంచి సమతుల్య ఆహారం ఇవ్వాలి. వారు ప్రశాంతంగా చదువుకునేందుకు గాలి, వెలుతురు ఉండే గది ఉంటే మంచిది. పరీక్ష సమయంలో ఇంట్లో టీవీలకు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటే మంచిది. ఆ ప్రభావం వారి మీద పడకుండా ఉండాలి.

- సీనియర్ డాక్టర్ సూర్యప్రకాష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల, హైదరాబాద్


పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

● **విద్యార్థులు ఇష్టపడి చదవాలి**



విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి. కొందరు విద్యార్థులు గణితం అంటే చాలా భయపడుతుంటారు. ఇష్టంతో గణితాన్ని చదివి సాధన చేస్తే అది ఎంతో సులువు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను అవగాహన చేసుకొని సూత్రాలను కచ్చితంగా నేర్చుకుంటే గణితం చాలా సులభం. నిత్యం ఉదయం, సాయంత్రం గంటపాటు సాధన చేస్తే చాలు గణితంలో మంచి మార్కులు సాధించవచ్చు.

- విజయానంద్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మునిమోక్షం

● **విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తాం**



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులలో ఒత్తిడి, భయాన్ని తొలగించేందుకు వందేమాతరం ఫౌండేషన్ వారు ఇప్పటికే ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారు. మిడ్జిల్ మండలంలో ఇప్పటికే ప్రారంభమైంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో కూడా జిల్లా కలెక్టర్ అనుమతితో విద్యార్థులకు నిపుణులచే అవగాహన కల్పిస్తాం. ఉపాధ్యాయులు కూడా పరీక్షపై భయాన్ని పోగొట్టేందుకు ఇప్పటికే వివిధ స్థాయిలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు భయం, ఒత్తిడి వదిలి పరీక్ష రాస్తే అనుకున్న లక్ష్యం సాధ్యం అవుతుంది.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

నేత్రదానంతో
ఇద్దరికి చూపు


చెవ్వ విశ్వనాథం (ఫైల్)

జడ్చర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న చెవ్వ విశ్వనాథం తన మరణానంతరం నేత్రదానం చేశారు. గత కొంతకాలంగా అస్వస్థతకు గురైన ఆయన శనివారం ఉదయం మృతిచెందారు. నేత్రదానంతో మరో ఇద్దరికి చూపును ఇచ్చిన వారవుతారంటూ జడ్చర్ల అవోపా అధ్యక్షులు యెలిశెట్టి మురళీకృష్ణ, చిత్తనూరి రామకృష్ణలు విశ్వనాథం కుటుంబ సభ్యులకు ప్రోత్సహించారు. దీంతో చెవ్వ విశ్వనాథం రెండు కళ్లు దానం చేయడానికి ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెలతో పాటు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని జిల్లా జనరల్ ఆసుపత్రి కంటి విభాగం వైద్యులకు సమాచారం అందించారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రి నుంచి టెక్నీషియన్ శివకుమార్ వచ్చి విశ్వనాథంకు చెందిన రెండు కార్నియాలను సేకరించారు. నేత్రదానానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మరో ఇద్దరికి చూపును ప్రసాదించేవిధంగా నిర్ణయం తీసుకుని నేత్రదానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులను పలువురు అభినందించారు.

మతసామరస్యానికి ప్రతీక రంగాపూర్ ఉర్సు

- రంగాపూర్ దర్గాలో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు - చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేటటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గా ఉత్సవాలు శనివారం అట్టహాసంగా జరిగాయి. కుల, మతాలకతీతంగా రంగాపూర్ ఉర్సు నిదర్శనమన్నారు. ఈ జాతరకు వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. హిందూ ముస్లింలు నిరంజన్ షావలీ దర్గాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలో అతి పెద్ద జాతరగా పేరొందిన రంగాపూర్ ఉర్సులో మద్యం విక్రయాలు తాండవిస్తున్నాయి. ఒకే ఊరు అయిన అధికారులు రెండు గ్రామపంచాయతీలుగా విడదీసిన రంగాపూర్ జాతరలో మాత్రం సిండికేట్‌గా మారి అందినకాడికల్ల దోచేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతీ ఏటా జనవరి 17 నుంచి ప్రారంభమయ్యే జాతర దాదాపు 10 రోజుల పాటు కొనసాగనుంది. ఈ ఏడాది తైబజారు లేకపోవడంతో ఎవరి రాజ్యం వారిదే అన్నట్టుగా ఉన్నట్లు తెలుస్తున్నది. జాతరను అదునుగా చూసుకొని కొబ్బరికాయలు ఏకంగా రూ.50లకు విక్రయిస్తున్నారు. .


రద్దీగా మారిన దుకాణాలు


భక్తులతో రద్దీగా మారిన రంగాపూర్ దర్గా

క్రైం కార్నర్


అదుపు తప్పి ఆటో బోల్తా
ఎనిమిది మందికి గాయాలు

● సింగోటం జాతరకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం


బోల్తాపడిన ఆటో నుంచి గాయపడ్డ వారిని బయటకు తీస్తున్న స్థానికులు

పెబ్బేరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగోటం జాతరకు వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ఆటో బోల్తాపడి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామశివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. తాల్లముడి మండల కేంద్రం, కర్నూల్ జిల్లా, మండ్లెం గ్రామం, జూపాడుబంగ్లా మండలం, నంద్యాల జిల్లా నివాసాలకు చెందిన ఒకే కుటుంబం గల బంధువులు కలిసి శుక్రవారం ఆటో తీసుకొని సింగోటం జాతరకు వచ్చారు. జాతర అనంతరం శనివారం వారి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. పెబ్బేరు మండలం అయ్యావారిపల్లి గ్రామ శివారు దాటుతున్న క్రమంలో ఆటో స్టీరింగ్ రాడ్ ఊసిపోవడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు పడిపోయింది. ఆటో కింద పడిపోగానే స్థానికులు అక్కడకు చేరుకొని గాయపడ్డవారిని ఆటో నుంచి బయటకు తీశారు. ఈ సంఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లకు సమాచారం అందించడంతో క్షతగాత్రులను రెండు అంబులెన్స్‌ల్లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు, గణేష్, పుల్లమ్మ, దిబ్బమ్మకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.

పాము కాటుతో ఇంటర్ విద్యార్థిని మృతి


మృతి చెందిన శ్రీజ(ఫైల్)

నవాబ్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పండుగకు మేనమామ ఇంటికి వెళ్లిన ఓ విద్యార్థిని తోటి బాలికలతో కలిసి ఆడుకుంటుండగా చెట్ల పొదల్లో ఉన్న విష పురుగు కరవడంతో సొమ్మసిల్లి పడిపోయింది. ఆసుపత్రికి చేర్చి చికిత్స అందిస్తుండగా మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్జాల గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సత్యం శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన కావలి సుగుణమ్మ తన కూతురు శ్రీజ(15)తో కలిసి సంక్రాంతి పండుగకు కాకర్జాల గ్రామానికి తన పుట్టింటికి వెళ్లింది. ఈనెల 17న శ్రీజ రాత్రి 10 గంటల ప్రాంతంలో తోటి బాలికలతో కలిసి దాగుడు మూతల ఆట ఆడుకుంటుండగా విష పురుగు ఎడమ కాలుకు కరవడంతో తనకు ఏదో కరిచిందని తల్లి, బంధువులకు తెలిపింది. ఇది గమనించిన వారు వెంటనే ఆలస్యం చేయకుండా జిల్లా ఆసుపత్రికి తరలించగా 18న ఉదయం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యం తెలిపారు. అయితే గత 9 నెలల క్రితం శ్రీజ తండ్రి కిట్టు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక జాతీయ రహదారి 44 పై అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యంను పట్టుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కే రవి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం గ్రామంలోని రేషన్‌కార్డు దారుల నుంచి కిలో బియ్యం రూ.10కి కొనుగోలు చేసి అధిక రేటుకు షాద్‌నగర్ పట్టణంలోని కోళ్లఫారానికి విక్రయించడానికి తీసుకువెళ్తున్న బియ్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా సుమారుగా 15 సంచుల్లో తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల బియ్యం, వాహనం, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్థానిక తహసీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

ఉమామహేశ్వరానికి పోటెత్తిన భక్తులు

- నందివాహనంపై ఊరేగిన పార్వతీపరమేశ్వరులు - శ్రీశైలం వెళ్తూ.. మొక్కుబడులు చెల్లింపు
- కొండ దిగుతుండగా ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం


ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

అచ్చంపేటటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం భక్తులు స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమామహేశ్వర క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, దేవరకొండ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. శనివారం ఉదయం స్వామివారిని నందివాహనంపై ఊరేగింపుగా ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు తీసుకెళ్లి అక్కడ స్వామివారికి గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం గర్భగుడి వరకు వేదమంత్రాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం సహస్రనామార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం 5 గంటలకు సాయమౌపాసన, శ్రీసూక్త, దుర్గాసూక్త హోమాలు, నందివాహనసేవ, మృగయాత్ర వినోదం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

కొండ పైకి భారీగా భక్తులు రావడంతో ఉమామహేశ్వర కొండపై నుంచి ఆర్టీసీ బస్సు మలుపు వద్ద దిగుతుండగా బస్సు కొండను ఢీకొని ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. ఆలయ కమిటీ సభ్యులు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. బస్సులో దాదాపు 60మంది భక్తులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. వాహనాలను కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరం వద్దనే నిలిపివేశారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ ఆధ్వరంలో ఎస్సై రమేష్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ఆర్టీసీ బస్సులను కొండపైకి భక్తులను చేరవేసేందుకు డీఎం ప్రసాద్ ఏర్పాటు చేశారు.


ఆలయ ప్రాంగణంలో రద్దీగా భక్తజనం


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు


కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్న భక్తులు

కాంగ్రెస్‌లోకి ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

అయిజటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీకి చెందిన ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. 2వ వార్డుకు చెందిన జులేఖాబేగం, 13వ వార్డుకు చెందిన వెంకటేష్, 20వ వార్డుకు చెందిన హసేన్‌బీతో పాటు కో-ఆప్షన్ మెంబర్ జాకీర్ హుస్సేన్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో అందరికీ సముచిత గౌరవం ఇస్తూ, అయిజ పట్టణ అభివృద్ధికి సహకారం అందిస్తానని సంపత్‌కుమార్ పార్టీలో చేరిన వారికి తెలిపారు. అలంపూర్ మార్కెట్ యార్డ్ దొడ్డెప్ప, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, అయిజ మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ నాయకులు శ్రీధర్, నాగిరెడ్డి, షేక్షావలి, సీతారామిరెడ్డి, లక్ష్మీకాంతారావు, ప్రకాష్‌గౌడుతో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఓడినా ఎల్లప్పుడు ప్రజల పక్షమే..

తాను ఎన్నికల్లో ఓడినా ఎల్లప్పుడు ప్రజల పక్షమే ఉంటానని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం అయిజలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో విషయం చెప్పి నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో ఏపీ అధికారులపై ఒత్తిడి తెప్పించి 25 ఇండెంట్ పెట్టించింది సంపత్‌కుమార్ అని మరిచిపోయి కొందరు మేమంటే మేము అని చెప్పుకోవటం విడ్డూరమన్నారు. అయిజ పట్టణంలో అభివృద్ధి కుంటుపడిందని అందువల్లే బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌లతో సంపత్‌కుమార్

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు దరఖాస్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలు ఈ నెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈ నెల 21న రూమ్ నెంబర్ 201, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయం, ఐడీవోసీలో ఉద్యోగ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ గ్రికో రోమ క్రీడలు ఉంటాయన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు..

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జోగుళాంబ గద్వాల జిల్లాలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ అభివృద్ధి శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగుల కోసం వంద రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత నిరుద్యోగులు అయితే కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. బీసీ విద్యార్థులకు 75 శాతం, ఇతర కులాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై 39 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగులు ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే మొదటి రైల్వే గేటు, టీఎన్‌టీ బిల్డింగ్, బీసీ స్టడీసర్కిల్, జోగుళాంబ గద్వాలలో సంప్రదించాలన్నారు.

కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్‌కి చెందిన వృద్ధురాలిపై ఈ నెల 1న షాపూర్‌కి చెందిన కొమ్ము మహేష్ అత్యాచారయత్నం చేసినట్లు శనివారం బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. బాధితురాలు, ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1న బాధిత మహిళ ఇంట్లో నిద్రిస్తుండగా భర్త తెల్లవారుజామున పాలు పితకడానికి ఇంటి తలుపు గడియ పెట్టకుండా వెళ్లడంతో.. అదే సమయంలో షాపూర్‌కి చెందిన మహేష్ మద్యం మత్తులో ఇంట్లోకి చొరబడి వృద్ధురాలితో అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. మద్యం మత్తులోని వ్యక్తిని కట్టెతో బయటికి తోసేసి తలుపు గడియ పెట్టుకున్నట్లు తెలిపారు. ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి పిలిచినట్లు వివరించారు. బాధిత వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు/ అమరచింత, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆత్మకూరు, అమరచింత మండల కేంద్రాల్లో సీపీఎం నాయకులు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, అమరచింత మండలాల కార్యదర్శులు రాజు, జీఎస్ గోపి మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభకు జాతీయ నాయకులతో పాటు తెలంగాణ సీపీఎం జిల్లా కార్యదర్శి హాజరై ప్రసంగించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి మండలాల నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజయ్, రమేష్ , బుచ్చన్న, వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి సన్మానం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన రవీష్ చంద్రన్ శనివారం బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడారు. వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ రవిచంద్ర, శిరీష దంపతుల కుమారుడు రవీష్ చంద్ర అండర్ 11 విభాగంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రథమ స్థానం పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చెస్ విజేతను వారి నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించి అభినందించినట్లు వివరించారు. విశ్వమోహనాచారి, సత్యనారాయణచారి, సత్యనారాయణ గౌడ్, మాధవ రావు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


రవీష్ చంద్రను సన్మానిస్తున్న వాకిటి శ్రీధర్

సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు

- రెండు రాష్ట్రాల్లో రూ.4 కోట్లు కాజేసిన ముఠాలో నలుగురి పట్టివేత - నేరస్థులంతా జిల్లా వాసులే : ఎస్పీ రావుల గిరిధర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా ఆన్‌లైన్‌లో నకిలీ ధని, ముద్ర లోన్ యాప్‌తో ప్రజలను మోసం చేస్తున్న ఓ సైబర్ ముఠాలోని నలుగురు నేరస్థులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. కోల్‌కత్తా, ఢిల్లీ, పాట్నా కేంద్రంగా కొంతకాలంగా అంకిత్, రాహుల్, పంకజ్ అనే వ్యక్తులు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురితో సైబర్ టీమును ఏర్పాటు చేసుకొని నకిలీ ధని, ముద్ర లోన్ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వనపర్తి పట్టణానికి చెందిన తోగుట రాజు అనే వ్యక్తికి గత నెల 17వ తేదీన సెల్‌ఫోన్ లో ఫేస్‌బుక్ చూస్తుండగా ధని ఫైనాన్స్ లోన్ యాప్ కనిపించగా దానిపై క్లిక్ చేశాడు. వెంటనే అతని సెల్‌ఫోన్‌కు ఒక నెంబర్ నుంచి ఫోన్ చేసి మేము ధని లోన్ యాప్ నుంచి మాట్లాడుతున్నామని, మీకు లోన్ కావాలా అని సంప్రదించారు. వెంటనే అతను రూ. 3 లక్షల లోన్ కావాలని చెప్పడంతో రూ.3 లక్షల లోన్ ఇస్తామని, ప్రతీ నెల రూ.8,860 ఇలా 36 నెలలు తిరిగి చెల్లించాలని సూచించారు. మొదట ఇన్సూరెన్స్ కోసం డబ్బులు పంపించాలని వారు అడుగగా వెంటనే అతను తన కుమారుడు అరవింద్ ఫోన్ పే నుంచి రూ. 6,850 ధర్మేంద్ర కుమార్ అనే వ్యక్తి పేరుతో స్కానర్ పంపించగా వెంటనే పంపాడు. మరికొద్ది సేపటికి అదే స్కానర్‌కు రూ.8,860 చెల్లించాలని తెలుపగా మళ్లీ పంపాడు. ఈ డబ్బులు మొత్తం మీ అకౌంట్లో క్రెడిట్ అయిపోతాయని చెప్పడంతో రాత్రంతా చూసి మరుసటి రోజు వరకు రాకపోవడంతో మోసపోయానని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ యాప్ పేరుతో రాష్ట్ర స్థాయిలో కూడా పెద్ద సంఖ్యలో మోసపోవడంతో ఈ కేసు విచారణను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ దృష్టికి తీసుకువెళ్లగా.. డీజీపీ ఆదేశాల మేరకు ఉమ్మడిగా కలిసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. వనపర్తి ఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ రత్నం, ఎస్‌బీ ఎస్ఐ రవి ప్రకాష్, వనపర్తి సీఐ కృష్ణయ్య, టౌన్ ఎస్ఐ హరిప్రసాద్, ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి 35 మంది నేరస్థులను ఈ కేసులో గుర్తించినట్లు తెలిపారు. అందులో శనివారం నలుగురు నేరస్థులైన వనపర్తి జిల్లా వాసులు గోపాల్‌పేట మండలం నర్సింగాయపల్లి గ్రామానికి చెందిన గగనం ప్రకాష్ కుమార్, వనపర్తి పట్టణంలోని మర్రికుంటకు చెందిన చీరల రవిసాగర్, సాయినగర్ కాలనీకి చెందిన గుంటి రాజశేఖర్, వెంగళరావు కాలనీకి చెందిన దేవర్ల సాయికుమార్ లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని విచారించగా కోల్‌కతా ఢిల్లీ, పాట్నాలలో ఉండే అంకిత్, రాహుల్, పంకజుల సహాయంతో ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రజలను మోసం చేసి సంపాదించిన డబ్బుల్లో అంకిత్, రాహుల్, పంకజ్ కు 70 శాతం మిగతా 30 శాతం వీరు పంచుకొని జల్సాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరంతా ఆన్‌లైన్ డేటా సేకరించి వారి నుంచి రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు ప్రాసెసింగ్, డాక్యుమెంట్ చార్జెస్, జీఎస్టీ, ఫైల్ క్లోజింగ్ చార్జెస్ పేరుతో బాధితుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని నేరస్థులంతా రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 10 వేల నుంచి 15 వేల మందికి ఫోన్ చేసి మోసగించాలని ప్రయత్నం చేయగా, వెయ్యి మందిని మోసగించి వారి నుంచి రూ.4 కోట్లు కాజేసినట్లు తెలిపారు. ఈ కాజేసిన డబ్బులతో నేరస్థులంతా విహార యాత్రలు, పబ్బులు, జల్సాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు నమ్మి ప్రజలు ఎవరు కూడా మోసపోవద్దని, ఎక్కడైనా మోసపోయినట్లు తెలిస్తే వెంటనే సైబర్ క్రైమ్ ఫోన్ నెంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేస్తే కేసును వేగవంతంగా పరిష్కరించవచ్చని తెలిపారు.

సంక్షేమ పథకాల సర్వే సమగ్రంగా చేపట్టాలి


చింతకుంటలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

పాన్‌గల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు సర్వేను సమగ్రంగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని చింతకుంటలో సంక్షేమ పథకాల అమలు సర్వే వివరాలను పరిశీలించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లాలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం మండలంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న గ్రామసభలో కూడా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి


కొత్తకోటలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొత్తకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సర్వే ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అప్పరాలలో రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల అమలు కోసం కొనసాగుతున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు సర్వే నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడారు. పథకాలకు నిజమైన అర్హులను గుర్తించేలా సర్వే నిర్వహించాలన్నారు. వ్యవసాయం చేస్తున్న కుటుంబాలకే రైతు భరోసా అందించాలనే ప్రభుత్వ నిర్ణయానికి తగ్గట్లుగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉండాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన

ఖిల్లాఘణపురం : రైతు భరోసా పథకం అమలు కోసం నాలా అనుమతులు పొందిన భూములను శుక్రవారం కలెక్టరేట్ ఏవో భానుప్రకాష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో నాలా కు సంబంధించిన రికార్డులను, సాగునీటి కాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన భూములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలా పొందిన భూములను పక్కాగా రికార్డుల్లో నమోదు చేసి, రైతు భరోసా పథకం వర్తించకుండా చూడాలని సూచించారు.

పెద్దమందడి : రేషన్ కార్డు, రైతుభరోసా పథకాల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సర్వేను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో తప్పిదాలు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి ఉన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న సుమ


ఖిల్లాఘణపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలందరూ బ్యాంకులు అందిస్తున్న సేవలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికార శాఖ కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ సుమ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలను మహిళలు వినియోగించుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి, ఆర్థిక మోసాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భాగ్యమ్మ, రాంబాబు, శ్రావణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


అమరచింతలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వీపనగండ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాలలో శనివారం మాజీ సీఎం ఎన్టీ రామారావు 29వ వర్ధంతిని టీ డీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, శ్రీను, వెంకటేశ్వర్లు, నరసింహ, బాల వెంకటయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

కొత్తకోట : పట్టణ చౌరస్తాలో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు శనివారం నిర్వహించారు. కిషన్ నాయక్, జనార్దన్ సాగర్, జనార్దన్‌గౌడ్, ఈశ్వరయ్య, జగ్గన్న, రామన్ గౌడ్, రామస్వామి, వలీయోద్దీన్ పాల్గొన్నారు.


కొత్తకోటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు/ అమరచింత : ఆత్మకూరు, అమరచింత మండల కేంద్రాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

ఖిల్లాఘణపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రతీ భారతీయుడు సనాతన ధర్మాన్ని కాపాడాలని కన్యాకుమారి నుంచి కాశీ వరకు పాదయాత్ర చేస్తున్న శివకరణ్ తెలిపారు. నేషనల్ ఆర్మీ గార్డు జాయింట్ వెల్ఫేర్ పాదయాత్రలో భాగంగా ఖిల్లాఘణపురం మండల కేంద్రం చేరుకున్న శివకరణ్ శనివారం బెస్తగేరి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు ఆంజనేయులు, భాస్కర్, బెస్త శ్రీను, అశోక్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన ఉపాధ్యాయులు

కొత్తకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పరాలలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. సంక్రాంతి సెలవు శుక్రవారంతో ముగియడంతో శనివారం పాఠశాలలు పునఃప్రారంభమాయ్యాయి. పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు విద్యార్థులు కనబడలేదు. విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదని పాఠశాల హెచ్ఎం శ్రీరాం, ఉపాధ్యాయులు దేవన్న, మహేశ్వర్ రెడ్డి, గోవింద్, రాజేష్, యాదగిరి, కవిత విడివిడిగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని పాఠశాలకు తీసుకొచ్చారు.

సాగునీటి మోటార్ల మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న రామకృష్ణారెడ్డి

పెద్దమందడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోజర్ల గ్రామ రైతుల సాగునీటి కోసం కానాయపల్లి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. ఈ సమస్యను వనపర్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తకాపు రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రిజర్వాయర్ వద్ద ఉన్న సమస్యను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. దీంతో రామకృష్ణారెడ్డి దగ్గరుండి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లను పరిశీలించి మరమ్మతులు చేయించారు.

అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పాలన

ఆత్మకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్‌ను జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులతో కలిసి ఆయన పర్యటించారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో ఐదు ఆసుపత్రులు ఉండగా అందులో ఆత్మకూరు ఆసుపత్రికి సరిపడ వైద్యులు లేని కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పీజేపీ క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలం పరిశీలించినట్లు తెలిపారు. ఈ నెల 21న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై రూ.18 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. వనపర్తి జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్, పరమేష్, శ్రీనివాసులు, తులసిరాజ్, రహమతుల్లా, నగేష్, మనివర్ధన్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు 966 మంది హాజరు


వనపర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో అబ్దుల్ ఘని

వనపర్తి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 1,045 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 966 మంది హాజరై, 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాలకు ముగిసింది. జిల్లాలోని వివిధ మండలాల గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు 11 గంటల వరకు చేరుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా హాల్‌టికెట్ నెంబర్లను పరీక్ష కేంద్రాల వద్ద బ్లాక్ బోర్డుపై ఏర్పాటు చేశారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల నిర్వహణ అధికారి గణేష్ కుమార్ పర్యవేక్షణ చేశారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం తెలంగాణ రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పుడున్న ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తామని, ఇది రైతు ప్రభుత్వమని అన్నారు. మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల్‌రెడ్డి, పరమేశ్వరచారి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల గోడు పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం ప్రారంభాలకే పరిమితమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని ఏదుట్లలో నూతనంగా ప్రారంభించిన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో లోవోల్టేజీ సమస్య ఉండటంతో అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి ఏదుట్ల గ్రామ సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారని, ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 9న అట్టహాసంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఏదుట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించి, పది రోజులు గడుస్తున్నా.. స్తంభాలు పాతిన వాటికి విద్యుత్ తీగలు అమర్చలేదని ఆరోపించారు. త్వరగా సబ్‌స్టేషన్ మరమ్మతు పూర్తి చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. నాయకులు తిరుపతయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్, గోపాల్, మతీన్, కాశీనాథ్, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థులు ముందుండాలి

వనపర్తి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడున్న పోటీ తత్వంలో పోటీ పరీక్షల్లో విద్యార్థులు ముందుండాలని తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ రిసోర్స్ పర్సన్ వెంకటేష్ అన్నారు. శనివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసీ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు అర్థమెటిక్ రీజనింగ్ మీద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతీ ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, రామరాజు యాదవ్, స్వామి, వెంకటేష్, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, నాగేంద్రచారి పాల్గొన్నారు.

క్రీడలు ఎంతో అవసరం

వనపర్తి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : యువకులకు క్రీడలు ఎంతో అవసరమని ఏబీవీపీ వనపర్తి జిల్లా ఖేల్ కన్వీనర్ ఓమేష్ అన్నారు. శనివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో క్రీడోత్సవ్ 2025 పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఖేల్ కన్వీనర్ ఓమేష్ మాట్లాడారు. విద్యార్థుల శారీరక, మానసిక దృఢతకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు విద్యార్థుల సర్వాంగ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. జనవరి 23 నుంచి 30 వరకు స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ క్రీడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సాతర్ల, కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, బంటి, గణేష్, సాయిచరణ్, అనిల్ పాల్గొన్నారు.

బాలల చట్టాల వినియోగంతో ప్రయోజనం


మాట్లాడుతున్న రజిని

వనపర్తి క్రైమ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాలల చట్టాల వినియోగంతో సమాజంలో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన ఓరియేంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవలు' అనే అంశంపై డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్యానల్ లాయర్లు పారలీగల్ వాలంటీర్లకు రెండు రోజులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పిల్లల కోసం తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పిల్లల ప్రయోజనం కోసం, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో లక్ష్మమ్మ, న్యాయవాదులు కృష్ణవర్ధన్ రెడ్డి, శ్రీనివాసచారి, రఘు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఐడీ జనరేట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శేఖర్

పెద్దమందడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఆపార్ ఐడీ జనరేట్ చేయాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శేఖర్, మరియు మండల విద్యాధికారి బాణం విష్ణు అన్నారు. మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఒకే యూనిక్యూ ఐడెంటీకార్డు ఉండాలని, దానినే ఆపార్ ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. అలాగే అకాడమిక్ పరంగా నిర్వహించే కార్యక్రమాలను, ఎస్ఎస్‌సీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. బడి బయటి పిల్లల గుర్తింపు పాఠశాలలో చేర్పించే కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని సూచించారు. జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శేఖర్ మాట్లాడుతూ ఆపార్ కార్డు జనరేట్ ఉద్దేశం మరియు ఉపయోగాలు అలాగే దానిని జనరేట్ చేయడంలో ఉండే వివిధ అంశాలు, మొదలగు వాటి గురించి ప్రధానోపాధ్యాయులకు వివరించారు.

సమావేశంలో వరప్రసాద్‌రావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.